
పలమనేరులో ఇంటి నెంబర్ల వారీగా ఓటర్ల జాబితా వివరాలను పరిశీలిస్తున్న బీఎల్‌వో

'సర్'కు సమాయత్తం

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్-సర్)కు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.2002లో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్లను ప్రస్తుతమున్న జాబితాతో సరిపోల్చనున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారీగా అప్పటి ఓటర్ల డేటాను బీఎల్‌వో యాప్‌కు పంపించారు. 2025 ఓటర్ల జాబితాలో ఈ డేటాను అనుసంధానం చేయగా మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టారు. దీనిలో 52 శాతం ఓటర్లు అందుబాటులో లేనట్లు గుర్తించారు. త్వరలో ఎస్ఐఆర్ నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేయనుంది. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి విచారణ చేపడుతున్నారు. అప్పటికీ వీరు అందుబాటులో లేకపోతే జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు.

● 2002నాటికి 18 ఏళ్లు నిండి ఓటర్లుగా ఉన్న వారి వివరాలను తీసుకున్నారు. 2025కు వీరి వయస్సు 40ఏళ్లు పైబడుతుంది. ఇప్పటి జాబితాలో 40 ఏళ్లు పైబడిన వారి వివరాలు, 2002లో 18ఏళ్లు నిండి ఓటు హక్కు పొందిన వారితో సరిపోల్చారు.

● మ్యాపింగ్ ఎలా జరిగిందంటే.. 2002 జాబితాలో ఓటరుగా ఉన్నవారి ఫొటో ఉందా ....లేదా అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నారు.2002-2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ చేసిన క్రమంలో 52 శాతం మంది ప్రస్తుత ఓటర్ల జాబితాలో లేనట్లు గుర్తించారు. 2002నాటికి 18 ఏళ్లు నిండినప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోని వారి పేర్లు ప్రస్తుత జాబితాలో నమోదై ఉంటే దీనికి కారణాలేంటి? అప్పట్లో వీరి కుటుంబ సభ్యుల పేర్లున్నాయా అనే కోణంలో మ్యాపింగ్ చేశారు.చిత్తూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2002నాటికి 13, 25, 269 మంది ఓటర్లున్నారు. 2025లో ఈ సంఖ్య 15, 74, 800కు పెరిగింది. అంటే 2, 49, 531మంది ఓటర్లు పెరిగారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ సందర్భంగా 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు.

కొత్త రేషన్ కార్డులకు డిసెంబరు నుంచి సరుకులు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం పాలనలోకి వచ్చిన తరువాత 8985 కొత్త బియ్యం రేషన్ కార్డులను ప్రజలకు అందజేసిన విషయం తెలిసిందే. వీటికి సంబంధించి డిసెంబరు నెల నుంచి సరుకులు అందిస్తామని డీఎస్‌వో శంకరన్ శుక్రవారం తెలిపారు.

పిడుగుపాటుతో పేలిన మొబైల్

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పొలంలో వరినాట్లు వేసే క్రమంలో పిడుగుపాటుతో జేబులో ఉన్న మొబైల్‌ఫోన్ పేలడంతో నరసింహారెడ్డి(36) తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన ఈయన ఇంటి సమీపంలోని పొలంలో శుక్రవారం సాయంత్రం వరి నాట్లు వేస్తున్నారు. ఈ క్రమంలో పిడుగుపాటుకు అతడి జేబులోని సెల్‌ఫోను పేలింది. తీవ్రంగా గాయపడిన అయన్ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరుకు తీసుకెళ్లారు.

కుప్పం ప్రజలకు రుణపడి ఉంటా!

● నారా భువనేశ్వరి


శాంతిపురం మండలం తుమ్మిశి చెరువు వద్ద జలహారతి

నేటి పర్యటన ఇలా...

శనివారం ఉదయం 10 గంటలనుంచి 11 గంటలదాకా కుప్పం మండలం పెద్దవంక వద్ద కనకనాచమ్మ ఆలయంలో భువనేశ్వరి ప్రత్యేక పూజలు చేస్తారు. సమీపంలోని పాలారు నదిలో బోట్ షికారు చేస్తారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలదాకా నాయనూరు గ్రామంలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం ఫాం హౌస్‌లో భోంచేస్తారు. మధ్యాహ్నం 2 గంటలనుంచి 3 గంటలదాకా దాసాగౌనూరు గ్రామంలో మహిళలతో సమావేశమవుతారు.మధ్యాహ్నం 3 గంటలనుంచి సాయంత్రం 5 గంటలదాకా ఎన్టీఆర్ ట్రస్టు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కుప్పం/శాంతిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నాయకత్వం మీద మీకున్న గురి ఎప్పుడూ నన్ను అబ్బురపరుస్తుంది. 8 సార్లు ఆయనను మీరు ఇక్కడినుంచి గెలిపించారు.ఇందుకు జీవితాంతం కుప్పం ప్రజలకు రుణపడి ఉంటా'.....ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ ప్రజలనుద్దేశించి అన్న మాటలివి. కుప్పం నియోజకవర్గ పర్యటనలో మూడవ రోజైన శుక్రవారం ఆమె శాంతిపురం, రామకుప్పం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా శాంతిపురం మండలం నడింపల్లెలో మహిళలతో జరిగిన ముఖాముఖిలో భువనేశ్వరి సంభాషిస్తూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందాయా అంటూ ఆరా తీశారు.హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను కుప్పం తీసుకురావడంతో కరువు సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడంవల్లే తాను ఆయన బదులుగా తరచూ కుప్పం వచ్చి ఇక్కడి ప్రజల సాదకబాధకాలు తెలుసుకుంటున్నానన్నారు. ఎటువంటి సమస్యనైనా చంద్రబాబుతో చెప్పి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా కూడా మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే ఎన్నో రకాల వృత్తులు, పనుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అలీప్ సంస్థను తీసుకు వచ్చారన్నారు. మహిళలందరూ ఈ ప్రాజెక్టులో చేరి వారిచ్చే శిక్షణలో పాల్గొని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌలభ్యాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో పైకి ఎదగడానికి వినియోగించుకోవాలని సూచించారు.కాగా శాంతిపురం మండలంలో తుమ్మిశి పెద్ద చెరువు, రామకుప్పం మండలం విజలాపురం చెరువుల వద్ద కృష్ణా జలాలకు భువనేశ్వరి హారతి ఇచ్చారు. అంతకుముందు శాంతిపురం మండలం కడపల్లెనుంచి తుమ్మిశి పెద్ద చెరువు దాకా ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించి స్త్రీ శక్తి పథకం ద్వారా వారు పొందిన లబ్ధిని గురించి వారినే అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం నుంచి కనమనపల్లె దాకా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ఆధార్ కార్డు లేకపోవడంతో ఆర్టీసీ బస్సులో టికెట్టు తీసుకుంటున్న భువనేశ్వరి

ఎన్‌హెచ్‌ఎం నోటిఫికేషన్‌పై

అనుమానమే నిజమైంది!

● మూడు కేటగిరీల్లో పోస్టుల భర్తీకి మాత్రమే ఉన్నతాధికారుల అనుమతి



చిత్తూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):నేషనల్ హెల్త్ మిషన్ కింద వైద్య ఆరోగ్య శాఖలో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు 10 కేటగిరిల్లో 56 పోస్టులకు గత నెల 9వ తేదిన నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణకు అదే నెల 22దాకా గడువు విధించారు. 56 పోస్టులకు గాను మొత్తం 2093మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. నవంబరు 7వ తేదిన ప్రొవిజినల్ మెరిట్ లిస్టను విడుదల చేస్తామని, 15న జాబితాపై ఏదైనా సందేహాలుంటే గ్రీవెన్స్‌కు అవకాశం కల్పించి అదే రోజున ఫైనల్ మెరిట్ జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నవంబరు 20న అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటించారు. అయితే గడువు దాటినా జాబితా విడుదల కాలేదు. కొన్ని కేటగిరీలకు అనుమతి లేకుండానే నోటిఫికేషన్ ఇవ్వడమే ఇందుకు కారణమని ప్రచారం జరుగుతోంది.రాష్ట్రస్థాయి అధికారుల అనుమతి లేకుండానే ఎన్‌హెచ్‌ఎం నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో అక్టోబరు 16వ తేదిన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే నిజమైంది. 10కేటగిరిల్లో పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే 3 కేటగిరిల్లో పోస్టులను భర్తీ చేసుకునేందుకు మాత్రమే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అనుమతి ఇచ్చినట్లు సమాచారం.

దరఖాస్తుల వివరాలివీ

మెడికల్ ఆఫీసరు- 13 పోస్టులకు గాను 97 దరఖాస్తులు, స్టాఫ్ నర్స్ 20 పోస్టులకు 1374, ఫైనాన్స్ కమ్ లాజిస్టిక్ కన్సల్టెంట్ 1పోస్టుకు 45, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2పోస్టులు మూడింటికి గాను 142, ఫిజియోథెరపిస్ట్ ఒక పోస్టుకు 50, శానిటరి అటెండెంట్ 2పోస్టులకు 47, సపోర్టింగ్ స్టాఫ్ 4పోస్టులకు 139, సెక్యూరిటీ గార్డ్ 2పోస్టులకు 43, లాస్ గ్రేడ్ సర్వీసెస్ 8పోస్టులకు 156 దరఖాస్తులు వచ్చాయి. ఆడియో మెట్రి 2పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మొత్తం 56 పోస్టులకు 2093 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

● మూడు కేటగిరిలకు మాత్రమే అనుమతి

మొత్తం 10 కేటగిరిలో పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్ పోస్టుల భర్తీకి మాత్రమే అనుమతి ఇచ్చారని సమాచారం.అయితే మిగిలిన పోస్టులకు సంబంధించి ఒక్కొక్కరు రూ.500 పెట్టి దరఖాస్తు చేసుకున్నవారి పరిస్థితి ఏమిటన్నది తెలియాల్సి ఉంది. అంతేకాకుండా నోటిఫికేషన్‌లో పోస్టులకు రోస్టర్‌ను ప్రకటించకపోవడంతో అనుమతి ఇచ్చిన మూడు కేటగిరిల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ నష్టపోయే అవకాశం ఉంది. ఉదాహరణకు... ఒక ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఓసీ మహిళ అని రోస్టర్‌లో ఉంటే ఆ పోస్టుకు ఓసీలో పురుషుడైనా అర్హత ఉండదు. అలాంటిది వేరే కులానికి చెందిన వారు దరఖాస్తు చేసుకుంటే ఆ అభ్యర్థి నష్టపోవాల్సిందే. ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా రోస్టర్ తప్పనిసరిగా నోటిఫికేషన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. రోస్టర్‌కు అనుగుణంగా అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకుంటారు. అయితే గత నెలలో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రోస్టర్‌ను పొందుపరచకపోవడంతో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డబ్బును, సమయాన్ని వృధా చేసుకున్నట్లయింది.దీంతో అనేకమంది అభ్యర్థులు ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి తిరిగి రోస్టర్‌తో నూతన నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని కోరుతున్నారు.


రామాపురంలో దొరికిన ఇన్నోవా

రూ.7 కోట్ల దోపిడీ కేసులో గుడిపాలవాసి

● నిందితుడి తండ్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ● ఇన్నోవాతో పాటు రెండు క్యాష్ బాక్సులు కూడా స్వాధీనం

చిత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో కోట్ల రూపాయలు దోపిడీ చేసిన ముఠాలో చిత్తూరు జిల్లా గుడిపాలకు చెందిన ఓ వ్యక్తి ఉన్నట్లు గురువారం రాత్రి పోలీసులు గుర్తించారు. గురువారం రాత్రి నిందితుడి తండ్రిని అరెస్టు చేసి బెంగళూరుకు తీసుకెళ్లారు. మరోవైపు రెండో రోజైన శుక్రవారం కూడా గుడిపాలలో బెంగళూరు పోలీసులు గాలింపు కొనసాగింది.ఓ బ్యాంకు నుంచి ఏటీఎంలలో నింపడానికి తీసుకెళుతున్న రూ.7.11 కోట్ల నగదును బుధవారం బెంగళూరు నగరంలో ఓ ముఠా తాము ఐటీ అధికారులమంటూ బెదిరించి దోపిడీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఇన్నోవా వాహనం బుధవారం రాత్రే గుడిపాల మండలం చిత్తపార గ్రామానికి చేరుకుంది. గురువారం ఉదయం మళ్లీ బయల్దేరుతుండగా, 190.రామాపురం వద్ద టైర్ పంక్చర్ అయింది. దీంతో ఆ ఇన్నోవాను అక్కడే వదిలేసి వెళ్లారు. బెంగళూరు నుంచి 13 మంది పోలీసు అధికారుల బృందం గురువారం గుడిపాలకు చేరుకుని ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకుని.. చిత్తపార, 190.రామాపురం గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు.చిత్తపార గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి రామదాసుకు రవి, రాకేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిద్దరూ బెంగళూరులోనే నివాసం ఉంటున్నారు. రామదాసు ఇద్దరు కుమారుల్లో రవి ఈ దోపిడీలో పాల్గొన్నట్లు బెంగళూరు పోలీసులు గుర్తించారు. ఈ రవినే ఆ దోపిడీ సొమ్ముతో బుధవారం రాత్రి చిత్తపారకు వచ్చి గురువారం మరో ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసింది. వెళ్లేటప్పుడు రెండు ఇనుప క్యాష్ బాక్సుల్ని రోడ్డు పక్కన గడ్డిలో వదిలేసి వెళ్లారు. గురువారం రామదాసుతో పాటు బంధువుల ఇళ్లలోకూడా బెంగళూరు పోలీసులు తీవ్రంగా గాలించారు. రవి ఆచూకీ లేకపోవడంతో అతని తండ్రి రామదాసును అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, ఈ దోపిడీ కేసులో ఇద్దరు నిందితుల్ని చిత్తూరు సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం బెంగళూరు పోలీసులు ప్రకటించారు. బెంగళూరు నగరంలోని బాణసవాడి, కల్యాణనగర ప్రాంతాలకు చెందిన ఆరుగురు నిందితులు ఈ దోపిడీకి పాల్పడినట్లు అక్కడి పోలీసులు చెబుతున్నారు. నిందితుల్ని పట్టుకోవడానికి ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రలకు బృందాలను పంపినట్లు బెంగళూరు పోలీసు అధికారులు వివరించారు. దొంగలు రెక్కీ చేశాకే, సీసీ కెమెరాలు లేని సర్కిల్ చూసుకుని దోపిడీకి పాల్పడ్డారని అక్కడి పోలీసులు నిర్ధారణకు వచ్చారు.


గుడిపాలలో దొరికిన క్యాష్ బాక్సులు



గజలక్ష్మీ నమోస్తుతే

● జనసంద్రమైన తిరుచానూరు

● ఉదయం పల్లకీపై మోహినిగా ఊరేగిన అమ్మవారు





బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 8 గంటలు: సర్వభూపాల వాహనం
సాయంత్రం 4.20 గంటలు: స్వర్ణరథోత్సవం
రాత్రి 7 గంటలు: గరుడవాహనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు గరుడ సేవకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో.. అమ్మవారి ఉత్సవాల్లోనూ ఐదో రోజు గజ వాహనసేవకు అంతటి ప్రాధాన్యం ఉంది. తిరుమల శ్రీవారి లక్ష్మీకాసుల హారాన్ని ధరించి.. శుక్రవారం రాత్రి మహాలక్ష్మిగా పద్మావతి అమ్మవారు తన ప్రీతిపాత్రమైన గజ వాహనంపై ఊరేగారు. అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులతో తిరుచానూరు జనసంద్రంగా మారింది. కీలుగుర్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్క భజనలు, జీయర్ల పరివారం ప్రబంధ పారాయణం చేస్తుండగా గజవాహన సేవ ముందుకు సాగింది. అమ్మవారికి హారతులిచ్చేందుకు భక్తులు పోటీపడ్డారు. తరలివచ్చిన భక్తజనంతో మాడవీధులు రద్దీగా మారాయి. పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అప్రమత్తమై పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉదయం.. మోహినీ రూపంలో పల్లకిలో వయ్యారంగా కూర్చున్న అమ్మవారు.. తన సుందర మనోహర సౌందర్యాన్ని ఎదురుగా ఉన్న దర్పణంలో చూసుకుని మురిసిపోతున్నట్లు కదులుతూ పరవశింపచేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిరుజల్లుల మధ్య పల్లకీ వాహన సేవ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర యెల్లా, సాంబశివరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వసంతోత్సవం జరిగింది.



- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

కనువిందుగా వసంతోత్సవం



అమ్మవారు ఊరేగుతుంటే.. అర్చకులు, అధికారులు వసంతాన్ని చల్లుతుంటే.. భక్తుల గోవింద నామస్మరణలతో తిరుచానూరు ఆలయ తిరుమాడవీధులు ప్రతిధ్వనించాయి. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారిని స్వర్ణకమల తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లుతూ వసంతోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. జోరు వర్షంలోను అమ్మవారి వాహన సేవ జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సహస్ర లక్ష్మీకాసులహారం శోభాయాత్ర

పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసులహారం శుక్రవారం పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరింది. గజవాహన సేవలో ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అదనపు ఈవో వెంకయ్య చౌదరి లక్ష్మీకాసుల హారాన్ని అలిపిరికి తీసుకొచ్చారు. అక్కడ్నుంచి శోభాయాత్రగా జేఈవో వీరబ్రహ్మం, ఇతర అధికారులతో కలిసి మండపానికి తీసుకొచ్చారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆ కాసుల హారాన్ని అర్చకులకు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ అమ్మవారి ఆలాయానికి హారాన్ని తీసుకొచ్చి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజ వాహనసేవలో ఉత్సవమూర్తికి ఈ సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని ధరింపచేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శోభాయాత్రలో పాల్గొన్న టీటీడీ ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు



అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పల్లకీ సేవ, రాత్రి గజవాహన సేవ ముందు కళాకారుల నృత్య సంబరం అమోఘంగా సాగింది. వివిధ రాష్ట్రాల కళాకారులు మాడవీధుల్లో ప్రదర్శించిన నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. తీన్‌మార్ డ్రమ్స్, రింగ్ ఫిజన్, ట్రైబల్ డ్యాన్స్, కోలాటాల ప్రదర్శనలు భక్తులు ఆకర్షించాయి.ఉదయం నూజివీడుకు చెందిన అమరావతి డ్రమ్స్ రాంబాబు బృందం తీన్‌మార్ డ్రమ్స్.. తణుకుకు చెందిన అంబిక డ్యాన్స్ అకాడమీకి చెందిన 20మంది కళాకారుల రింగ్ ఫ్యూజన్ నృత్యం, నూజివీడు లాలేశ్వరరావు బృందం చెక్క భజనలు, కొవ్వూరుకు చెందిన శివరామకృష్ణ బృందం ట్రైబల్ డ్యాన్స్ భక్తులను కనువిందు చేశాయి. తిరుపతికి చెందిన హరిత బృందం పలు దేవతా మూర్తులు, డాక్టర్ మురళీకృష్ణ బృందం నవదుర్గలు, అష్టలక్ష్మి వేషధారణ భక్తులను మైమరిపించాయి. చిత్తూరుకు చెందిన వాణిశ్రీ బృందం, పొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి బృందం, రైల్వే కోడూరుకు చెందిన సుజన కోలాటాలు అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



నృత్య సంబరం.. అమోఘం











శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.61 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,839

తలనీలాలు సమర్పించినవారు: 19,220

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా



బస్సును పక్కకు తొలగిస్తున్న క్రేన్

- ఆరుగురికి గాయాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విజయవాడ నుంచి 21 మంది ప్రయాణికులతో బెంగళూరుకు వెళ్తున్న బస్సు దొడ్లవారిమిట్ట వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురానికి చెందిన శ్రీనివాసులు, ఏలూరుకు చెందిన శ్రీనివాసులు, గుంటూరుకు చెందిన తోరటి మల్లీశ్వరి, ఎం.అంజమ్మ, షణ్ముగనాథ్, ఈశ్వర్‌రావు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు క్రేన్ సాయంతో బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలిగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన జర్నలిస్ట్ శ్రీనివాసులు
- విచారణ నేటికి వాయిదా

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరకామణిలో చోరీ వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు కోరుతూ పిటిషన్ వేసిన తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు దాఖలు చేసిన పిటిషన్ పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ అభ్యర్థనపై అభిప్రాయాన్ని చెప్పాలని సీఐడీని ఆదేశించింది. వ్యాజ్యం పై తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.పరకామణి చోరీ వ్యవహారం సీఐడీ విచారణకు ఆదేశించాలని పిటిషనర్‌కు బెదిరింపులు వస్తున్నాయని, భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల 15న వినతి సమర్పించినా పోలీసుల నుండి ఎలాంటి స్పందన లేదని జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తు ముగిసేవరకు భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

పోటెత్తిన భక్తులు

- సాయంత్రానికే గ్యాలరీల్లో నిండిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో శుక్రవారం రాత్రి జరిగిన పద్మావతి అమ్మవారి గజ వాహన సేవకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం 6.45 గంటలకే భక్తులతో గ్యాలరీలు నిండిపోయాయి. మాడవీధుల్లో భక్తులు కిక్కిరిసి ఉన్నారు వెలుపల ప్రధాన మార్గం వరకు భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. ఇక, గేట్ నెంబర్ 2ను సాయంత్రం 6.30గంటలకు మూసేయడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎమ్మెల్యేపులివర్తి నాని హారతి పాయింట్ ఉన్న ప్రతిగేట్ వద్ద విజిలెన్సు సిబ్బందికి తొక్కిసలాటలు లేకుండా సూచనలు సలహాలు ఇచ్చారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో స్థానికులు రావడంతో కాస్త తోపులాట జరిగింది. రాత్రి 10.20 గంటలకు అమ్మవారి గజ వాహనం.. గంగుంద్ర మండపం వద్దకు చేరింది. చిన్న చిన్న ఘటనలు మినహా వాహన సేవ ప్రశాంతంగా ముగిసింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషి, ఎస్పీ తదితరులు

పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు

తిరుచానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన 25వ తేది జరిగే పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషి, ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పంచమి తీర్థం ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం, పుష్కరిణి పరిసరాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. స్నానాలు చేసే భక్తుల భద్రత దృష్ట్యా పుష్కరిణిలో లైఫ్‌గార్డులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, పోలీసు డైవర్స్, విజిలెన్సు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు వెంకట నారాయణ, ప్రసాద్, గిరిధర్, టీటీడీ విజిలెన్సు అధికారులు పాల్గొన్నారు.

కారు కనిపిస్తే రాళ్లేస్తాడు

- తిరుపతిలో మానసిక రోగి విధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతడికి మానసిక స్థితి సరిగాలేదు. కార్లు కనిపిస్తే చాలు.. వాటిపై రాళ్లు వేసి ధ్వంసం చేస్తున్నాడు. గతంలో కారు ఘటన ఏదో ఇతడిని కలవరానికి గురిచేయడమే కారణమని అలిపిరి పోలీసులు అంటున్నారు. ఇలా దాడికి పాల్పడే వ్యక్తిది తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి. తల్లిదండ్రులతో కలిసి మంగళంలో ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో ఫుల్లుగా మద్యం తాగి.. తిరుపతి నగరం మధురానగర్‌లోకి వచ్చాడు. ఓ ఇంటి ముందు ఆపి ఉన్న కారుపై బండరాళ్లు వేసి ధ్వంసం చేశాడు. ఆ తర్వాత దుకాణాలపైన రాళ్లు విసిరాడు. దీంతో ఐదారు దుకాణాల తలుపులు, షట్టర్లు దెబ్బతిన్నాయి. ఈ రాళ్ల దాడిలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. ఈ విధ్వంసాన్ని గమనించిన సీపీఎం నేత కందారపు మురళి అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. అలిపిరి ఎస్ఐ అజిత, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. మానసిక రోగి కావడంతో విచారించి అతడి తల్లితండ్రులకు అప్పగించామని పోలీసులు చెప్పారు.

తరచూ ఇలాంటి ఘటనలే

ఈ మానసిక రోగే అని కాదు.. మధురానగర్‌లో పలుమార్లు తాగుబోతులు కూడా ఇలాంటి విధ్వంసాలకే పాల్పడ్డారు. ఆరు నెలల కిందట ఇక్కడ నివాసమున్న ఇద్దరు ఫొటో జర్నలిస్టుల ద్విచక్ర వాహనాలను అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని మందుబాబులు బండ రాళ్లతో ధ్వంసం చేశారు. వినాయక ఆలయం వద్దనున్న రెండు మున్సిపల్ కాంప్లెక్సుల వద్ద రాత్రి 10 గంటలైతే చాలు కొందరు బహిరంగంగా మద్యం తాగుతూ దారిన పోయేవాళ్లను వ్యంగ్యంగా మాట్లాడుతున్నట్లు స్థానికులు చెప్పారు. దీంతో ఆ దారిన వెళ్లాలంటే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు స్పందించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం)/భాకరాపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల చొప్పున జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ మైలావాండ్లపల్లెకి చెందిన వి.శ్రీనివాసులు, వి.జయచంద్ర శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికి.. దుంగలను డంపింగ్ ప్రాంతాలకు చేర్చేవారు. ఆ తర్వాత వాటిని తమిళనాడులోని స్మగ్లర్లకు అమ్మేవారు. ఈ క్రమంలో 2014లో వీరు ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నారనే సమాచారంతో అప్పటి భాకరాపేట ఎస్ఐ నెట్టికంఠయ్య, సిబ్బంది కలసి దాడులు చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై పలు దఫాలుగా కేసు విచారణ జరిగింది. అనంతరం తిరుపతి ఎర్రచందనం కోర్టుకు కేసును బదిలీ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితులకు ఏడాది పాటు జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా, స్మగ్లర్లకు శిక్ష పడడానికి కృషి చేసిన చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ, ప్రస్తుత సీఐ ఇమ్రాన్ బాషా, ఎస్ఐ రాఘవేంద్ర, అప్పటి ఎస్ఐ నెట్టికంఠయ్య, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ హరినాథ్, కోర్టు కానిస్టేబుల్ నరసింహులును టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీవారి సేవలో హోం మంత్రి అనిత



తిరుమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

సోషల్ మీడియాలో ఇళయరాజా ఫొటో వాడొద్దు

- మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత స్వరకర్త 'ఇసైజ్ఞాని' ఇళయరాజా ఫొటోను సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి నెట్‌వర్కింగ్ సైట్లలో ఉపయోగించడంపై మద్రాస్ హైకోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. ఈ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో తన అనుమతి లేకుండా తన ఫొటోను ఉపయోగించడాన్ని నిషేధించాలని కోరుతూ ఇళయరాజా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీ సాయంతో తన ఫొటోను మార్ఫింగ్ చేసి వాణిజ్యపరంగా వినియోగిస్తూ ఆదాయాన్ని అర్జిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత హక్కులను హరించే చర్య అని పేర్కొన్న ఇళయయరాజా..ఇకపై తన అనుమతి లేకుండా ఎవ్వరూ ఉపయోగించకుండా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఇళయరాజా ఫొటోలను ఆయన అనుమతి లేకుండా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లలో తాత్కాలికంగా ఉపయోగించరాదని స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రశాంతంగా రాష్ట్రపతి పర్యటన



రాష్ట్రపతి రాకతో నిర్మానుష్యంగా శ్రీవారి ఆలయ పరిసరాలు



శ్రీవారి ఆలయంలో ద్రౌపది ముర్మును పలకరిస్తున్న జీయర్ స్వాములు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల తిరుమల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్న ఆమె.. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ్నుంచి వరాహస్వామి ఆలయానికి వెళ్లేందుకు టీటీడీ బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేసింది. చిరు జల్లుల కురుస్తున్నా.. రాష్ట్రపతి కాలినడకనే వెళ్లి వరాహస్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి రాష్ట్రపతితోనే రాగా.. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అర్చకబృందంతో కలిసి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవిరాట్టును దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. చైర్మన్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి, చైర్మన్, ఈవో, అదనపు ఈవోతో పాటు బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, జానకీదేవి, పనబాకలక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులున్నారు. సంప్రదాయాన్ని పాటిస్తూ రాష్ట్రపతి వ్యక్తిగత భద్రతాసిబ్బంది పంచె, షర్టుతో ఆలయ ప్రవేశం చేశారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా అక్కడక్కడ వాహనాలను ఆపేయడంతో భక్తులు స్వల్పంగా ఇబ్బంది పడ్డారు. ద్రౌపది ముర్ము దర్శన సమయంలో ఆలయం వద్దకు ఎవరినీ అనుమతించలేదు.

ప్రొటోకాల్ పక్కనపెట్టి

ఆలయం నుంచి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి.. రాంభగీచ సర్కిల్ వద్దకు నిలుచుని ఉన్న భక్తులను గమనించారు. ప్రొటోకాల్ పక్కన పెట్టి వాహనాన్ని రోడ్డుపైనే ఆపి భక్తుల వద్దకు వెళ్లి పలకరించారు. హెచ్‌టీ కాంప్లెక్స్ వరకు నడుచుకుంటూ వెళ్లి భక్తులకు అభివాదం చేశారు. కొందరు పిల్లలకు చాక్లెట్లు పంచారు. అనంతరం గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆమె.. కాసేపు విశ్రాంతి తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు.



విమానాశ్రయంలో రాష్ట్రపతికి మెమెంటో ఇస్తున్న మంత్రి అనిత

రాష్ట్రపతికి సాదర వీడ్కోలు

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: తిరుమల నుంచి శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఆమెకు సాదర వీడ్కోలు పలికారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన అడ్మిషన్ల గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీలో భాగంగా ఉన్నత విద్యామండలి కేటగిరి-బి కింద స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు తెలిపారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో డిగ్రీలో స్పాట్ అడ్మిషన్ పొందవచ్చునని పేర్కొన్నారు. విద్యార్థులు బీఏలో అడ్మిషన్లకు 99630 63258, బీకాంలో అడ్మిషన్లకు 98499 59423, బీఎస్సీలో అడ్మిషన్లకు 99851 65051 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



సుబ్రమణ్యం రెడ్డి (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ కత్తి శ్రీనివాసులు కథనం మేరకు .. వేలూరు జిల్లా కాట్పాడి తాలూకా పెద్ద మిట్టూరుకు చెందిన జీఆర్ సుబ్రమణ్యం రెడ్డి (62) కూర్మాయిపల్లెలో జరిగిన తమ బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. అనంతరం కూర్మాయి పల్లె నుంచి కేజీ సత్రానికి వెళుతున్న ఓ ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి తిరుగు ప్రయాణ మయ్యాడు. మార్గమధ్యంలో కుమ్మరపల్లె సమీపంలో కుక్కలు అడ్డురావడంతో సడన్ బ్రేక్ వేయడంతో సుబ్రమణ్యంరెడ్డి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన కల్యాణ్

గుడిపాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలూరు-చిత్తూరు జాతీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్యాణ్ (26) అనే యువకుడు మృతి చెందాడు. చిత్తూరు రూరల్ మండలం పెద్ద శెట్టిపల్లెకు చెందిన కల్యాణ్ స్వగ్రామం నుంచి చిత్తూరుకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యమైన కొత్తపల్లె సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేశారు.

చోరీ కేసుల్లో ఇద్దరికి ఆరు నెలల జైలు

చిత్తూరు లీగల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పరిధిలో జరిగిన పలు మోటారు సైకిళ్ల దొంగతనాల కేసులో తమిళనాడుకు చెందిన జయకుమార్, లోకనాథన్‌లకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి షేక్ బాబాజాన్ తీర్పునిచ్చారు. నగరంలో జరిగిన మోటారు సైకిళ్ల దొంగతనాలకు సంబంధించి ఈ ఏడాదిలో చిత్తూరు వన్‌టౌన్, టూటౌన్ పోలీసు స్టేషన్లలో ఆరు కేసులు నమోదయ్యాయి. టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. నాల్గవ అదనపు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ బాబాజాన్ ఇద్దరు నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష విధించారు. నిందితులకు శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

మైక్రో ఇరిగేషన్ సెన్సెస్ పూర్తి చేయండి : డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న ఏడవ మైక్రో ఇరిగేషన్ సెన్సెస్ వంద శాతం ఈ నెల 25లోగా పూర్తి చేయాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ 101718 ఇరిగేషన్ సోర్సస్ జిల్లాలోఉండగా ఇంత వరకు 98850 సోర్సస్ సెన్సెస్‌ను పూర్తి చేశామని, మిగిలిన మూడు శాతాన్ని పూర్తి చేయాలన్నారు. తమకు ఇచ్చిన యాప్‌లో వీఆర్వోలు, నీటి లభ్యత వివరాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి నమోదు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద ఇంకా లబ్ధిపొందని రైతులు తమ భూ వివరాలకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచించారు. వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో కూడా పెండింగ్‌లో ఉన్న 16వేల దరఖాస్తులను త్వరగా పరిశీలించి లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చేసాయం అందేలా చూడాలన్నారు. ఇందుకు గతంలో నిర్దేశించిన ఫీజును ప్రభుత్వం మాఫీ చేసిందని గుర్తించారు. ఏపీ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వీఆర్వోలు పరిశీలించాలని ఆదేశించారు. రైతుల గుర్తింపు సంఖ్యను పొందేందుకు రైతు భూమి ఖాతా నెంబరుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేయాలన్నారు. ఆధార్‌కార్డులోని పేరు, పట్టాదారుడి పేరు ఒకటిగా ఉండేలా చూడాలని చెప్పారు. 90 రోజుల్లో హౌసింగ్ పట్టాల పంపిణీని తహసీల్దార్లు సమర్థవంతగా పూర్తిచేయాలని సూచించారు. పీజీఆర్ఎస్, 22ఎ, రెవెన్యూ అంశాలపై సూచనలు జారీ చేశారు.

నా మొదటి ప్రాధాన్యం కుప్పానికే : నారా భువనేశ్వరి

రామకుప్పం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రి నారాలోకేశ్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరికి నిధులు కేటాయించాలని పట్టుబడుతుంటారని, తాను మాత్రం మొదటి ప్రాధాన్యత కుప్పానికే ఇవ్వాలని కోరుతుంటానని సీఎం సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. ఈ విషయంలో తన అభిప్రాయానికి మద్దతు ఇస్తున్న లోకేశ్‌కు కృతజ్ఞత లు తెలుపుతున్నానని తెలిపారు.శుక్రవారం ఆమె రామకుప్పం మండలం విజలాపురంలో కృష్ణాజలాలతో నిండిన పెద్దచెరువులో జలహారతి, ఆనిగానూరులో మహిళలతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు ముందు నుంచి మహిళా పక్షపాతి అని, మహిళల ఆర్థిక స్వావలంబన, సంక్షేమంకోసం ఆయన అమలు చేసినన్ని పథకాలు వేరెవరూ అమలు చేయలేదన్నారు.రాష్ట్రంలో సాగు, తాగునీటి కోసం రైతులు, ప్రజలు ఇబ్బంది పడకూడదని, నిరుపేదలు ఆకలితో పస్తులుండరాదన్న స్వర్గీయ ఎన్టీయార్ ఆకాంక్షలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని ఆమె తెలిపారు. ముఖ్యంగా కరువుసీమగా పిలువబడ్డ రాయలసీమ రైతాంగం కడగండ్లు తీర్చేందుకు ఎన్టీయార్ రూపకల్పన చేసిన హంద్రీ-నీవా సుజలస్రవంతిని ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు.

కొనసాగుతున్న జంట ఏనుగుల దాడులు





ఏనుగులు తొక్కేసిన వరిపైరు - ఏనుగులు నేలకూల్చిన బీన్స్ తోట

రామకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో పంటలపై జంట ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడులతో అటవీజనం భయాందోళనలతో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గురువారం రాత్రి జంట ఏనుగులు జీడిమాకులపల్లె, కోటచేను, పాలరేవుగడ్డ ప్రాంతాల్లో హల్‌చల్ చేశాయి. జీడిమాకులపల్లె సమీప పొలాలు, తోటలపై దాడులు చేశాయి. వరి, రాగి, బీన్స్ పంటల్లో తిరుగుతూ పాక్షికంగా ధ్వంసం చేశాయి. ఓ రైతుకు చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచేశాయి. ఏనుగులు ప్రతి రాత్రి పొలాలవైపు వస్తుండటంతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పాలరేవుగడ్డ, లక్ష్మీపురం, ఏగుట్ట, రాములగుచేన్లు గ్రామాల సమీపంలో పొలాలు, తోటల్లో ప్రవేశించే అవకాశాలున్నాయని తెలిపారు. చీకటి పడ్డాక ఎవరూ పొలాలు వద్దకు వెళ్లరాదని కోరారు. ఏనుగుల దాడులపై 8919668651, 6301667521 ఫోన్‌నంబర్లకు వెంటనే సమాచారం అందించాలని కోరారు.

ట్రాక్టరు బోల్తా: డ్రైవరు మృతి

తవణంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవరు మృతి చెందిన సంఘటన మండలంలోని బాహుదానది వంతెన కింద శుక్రవారం జరిగింది. ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు.. తవణంపల్లె మండలంలోని పుణ్యసముద్రం పంచాయతీ ఎల్.బి.పురానికి చెందిన వీరయ్య కుమారుడు వెంకటేష్(54) ట్రాక్టరులో పందులకు మేత తీసుకువెళతూ బాహుదానది వంతెన కిందకి దిగే క్రమంలో ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవింగ్ చేస్తూ ఉన్న వెంకటేష్‌పై ట్రాక్టరు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.



బోల్తా పడ్డ ట్రాక్టరు (ఇన్‌సెట్లో) మృతిచెందిన వెంకటేష్

క్లస్టర్ల వారీగా రైతుల అభివృద్ధికి తోడ్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వర రావు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ల వారీగా మామిడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన తోడ్పాటును అందిస్తోందని జిల్లా ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయ సమావేశ మందిరంలో చిత్తూరు మ్యాంగో క్లస్టర్ రైతులు సమావేశం నిర్వహించారు. నేషనల్ హార్టికల్చర్ బోర్డు ఆధ్వర్యంలో ఉద్యానశాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ ఏడీ మాట్లాడుతూ మామిడి సాగు చేస్తున్న రైతులను, గుజ్జు పరిశ్రమలను, వ్యాపారులను ఒక సమూహం (క్లస్టర్)గా చేర్చి అభివృద్ధి, లాభదాయక లక్ష్యంతో ప్రభుత్వం అవసరమైన తోడ్పాటు అందిస్తోందన్నారు. మూడు దశల్లో రైతులకు అండగా ఉంటుందన్నారు. తొలి దశలో మామిడి కోతల అనంతరం సాగు యాజమాన్యంలో ఆధునిక పద్ధతులు, యాంత్రికీకరణ, పంట సంరక్షణ, నీటి యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం అమలు చేయనున్నట్లు తెలిపారు. మలిదశలో పంట కోత మొదలు టేబుల్ వెరైటీలు ప్రొసెసింగ్, పాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, ఉత్పత్తులు, పరిశ్రమల స్థాపన ఉంటుందన్నారు. మూడో దశలో దేశ, విదేశాల్లో మార్కెటింగ్‌తో రైతులను అనుసంధానం చేసి ఎగుమతులకు సహకారం అందించనున్నట్లు వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధరం, ఆనందనాయుడులు మాట్లాడుతూ తొలుత చిత్తూరు మ్యాంగో క్లస్టర్ ఏర్పాటు చేసి దీని పరిధిలోని 11 మండలాల రైతులకు ప్రయోజనం చేకూర్చనున్నట్లు తెలిపారు. తర్వాత పుత్తూరు, పలమనేరు, దామల్‌చెరువులను క్లస్టర్లుగా రూపొందిస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా రాయితీలు, రుణాలు, పలు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు హరిబాబు, లవకుమార్ రెడ్డి, సుకుమార్‌నాయుడు, క్లస్టర్ పరిధిలోని రైతులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎలారిక్కిం సౌగ్యమా

మహిళలను తమిళంలో పలకరించిన భువనేశ్వరి

కుప్పం/శాంతిపురం/రామకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం సతీమణి, ఎన్టీయార్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం శాంతిపురం, రామకుప్పం మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు విశేషాలు చోటు చేసుకున్నాయి. శాంతిపురం మండలం తుమ్మిశి పెద్ద చెరువు, రామకుప్పం మండలం విజలాపురం చెరువులవద్ద ఆమె జలహారతి ఇచ్చారు. ఆయా చెరువుల వద్దకు పెద్దయెత్తున ప్రజలు తరలివచ్చారు. చెరువుల పరిసరాలు టీడీపీ జెండాలతో పసుపుమయమయ్యాయి. చంద్రబాబు జిందాబాద్ అన్న నినాదాలతో మార్మోగాయి.

- శాంతిపురం మండలం కడపల్లెనుంచి తుమ్మిశి చెరువు దాకా భువనేశ్వరి ఆర్టీసీ బస్సులో మహిళలతో కలసి ప్రయాణించారు. స్త్రీ శక్తి పథకం గురించి, తద్వారా వారికి చేకూరుతున్న లబ్ధిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్సులోని అందరికీ ఆధార్ కార్డు చూసి, మహిళా కండక్టర్ జీరో ఫేర్ టికెట్లు ఇచ్చింది. అదే బస్సులో ప్రయాణిస్తున్న భువనేశ్వరిని కూడా ఆధార్ కార్డు చూపించమని కోరింది. అయితే ఆధార్ కార్డు తనవద్ద లేదని, ఫోన్‌లో ఉన్నా, దాన్ని ఇంటివద్దనే మరచిపోయానని భువనేశ్వరి సమాధానం ఇచ్చింది. ఆధార్ కార్డు చూపించకుంటే టికెట్టు తీసుకోవాల్సిందేనని కండక్టర్ చెప్పడంతో భువనేశ్వరి టికెట్టు కొనుగోలు చేసింది.
- నడింపల్లెలో మహిళలతో ముఖాముఖి సంభాషించిన భువనేశ్వరి తాను తరచూ కుప్పం వస్తున్న కారణం ఏమిటో వివరించారు. మూడు నెలలకోసారి కుప్పం వచ్చి ప్రజలను పలకరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రాభివృద్ధి యజ్ఞంలో ఆయనకు టైం చిక్కడం లేదన్నారు. దీంతో కుప్పం వెళ్లి ప్రజలను పలకరించి వారి సమస్యలను తెలుసుకుని తనకు చెప్పాల్సిందిగా చంద్రబాబే తనను అడిగారన్నారు. అందుకే ఆయన బదులుగా తాను కుప్పం వస్తున్నానని రహస్యాన్ని విప్పారు.అంతేకాదు భువనేశ్వరి తన ప్రసంగాన్ని ఎలారిక్కిం సౌగ్యమా (అందరూ బాగున్నారా) అంటూ తమిళంలో ప్రారంభించారు. సుమారు 50 సెకండ్లపాటు సభలోని మహిళలను తన తమిళ సంభాషణతో అలరించారు. కుప్పం నియోజకవర్గం తమిళనాడు సరిహద్దుల్లో ఉండడంతో ఇక్కడ తమిళ భాష మాట్లాడే ప్రజలు ఎక్కువ. అందుకనే ఆమె తమిళంలో ప్రసంగాన్ని ప్రారంభించారు.అంతకు ముందు స్థానిక మహిళలు కొందరు కోలాటమాడారు. వారితో కలిసి భువనేశ్వరి కూడా అడుగులు వేశారు.
- శాంతిపురం మండలం కెనమాకులపల్లెలో మొక్కలు నాటే కార్యక్రమానికి భువనేశ్వరి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పరిరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. కెనమాకులపల్లెలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ వైభవ్ కాంప్లెక్స్‌ను భువనేశ్వరి ప్రారంభించారు.
- రామకుప్పం మండలం విజలాపురం నుంచి ప్రయాణిస్తున్న సమయంలో మార్గమధ్యంలో చిన్నారులను చూసి వాహనం దిగారు. వారివద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు.





విజలాపురం మార్గంలో పిల్లలతో భువనేశ్వరి- రామకుప్పం మండలం ఆనిగానూరులో మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి

పంటలపై ఆగని గజదాడులు



ఒంటరి ఏనుగు దాడిలో ధ్వంసమైన మామిడి చెట్టు

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఒంటరి ఏనుగు దాడులు ఆగడంలేదు. మండలంలోని పాతపేట పంచాయతీలో గురువారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలపై దాడి చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి గురువారం రాత్రి బయలుదేరిన ఒంటరి ఏనుగు కల్లూరు-గంటావారిపల్లి రోడ్డును దాటుకుంది. రోడ్డుకు సమీపంలో ఉండే మామిడిచెట్లను విరుచుకుంటూ పాతపేట వద్దకు చేరుకుంది. కల్లూరు- సదుం రోడ్డును దాటుకున్న ఒంటరి ఏనుగు మంగళంపేటలోని పలువురి పంటలను నాశనం చేస్తూ పూరేడువాండ్లపల్లి వద్దకు చేరుకుంది. నూతనంగా నిర్మిస్తున్న నాగాలమ్మ ఆలయం గోడలను ఒంటరి ఏనుగు తోసేసింది. పలువురి మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. అనంతరం వచ్చిన మార్గంలోనే పశ్చిమ విభాగం అడవిలోకి చేరుకుంది. శుక్రవారం పగలంతా గోగులమ్మ వంక వద్ద ఒంటరి ఏనుగు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు.

9నెలల పాపతో చెక్ డ్యామ్‌లో దూకి ఆత్మహత్య





ఆదిలక్ష్మి, క్రితిక మృతదేహాలు
ఆదిలక్ష్మి (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బిడ్డతోపాటు తల్లి చెక్ డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌడేపల్లె మండలంలో శుక్రవారం ఉదయం జరిగింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. చౌడేపల్లె మండలంలోని వెంగళపల్లెకు చెందిన నరసింహులు కుమార్తె ఆదిలక్ష్మి(37) అదే పంచాయతీలోని గాజులవారి పల్లెకు చెందిన గంగాధర్‌తో వివాహమైంది. ఆదిలక్ష్మి సోమల మండలంలో ఆవులపల్లె సచివాలయంలో తాత్కాలిక కాంట్రాక్ట్ ఏఎన్ ఎంగా పనిచేస్తుండగా.. భర్త మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్ట్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. వీరికి 9 నెలల పాప క్రితిక ఉంది. పాప పుట్టినప్పటి నుంచి కాళ్లు చేతులు కదిలించడం లేదని హైదరా బాద్, తిరుపతి, బెంగళూరు తదితర ఆస్పత్రులలో చూపించినా ఫలితం లేదు. దీంతో తన చిన్నారి ఆరోగ్యంపై విరక్తి చెంది వెంగళపల్లె సమీపం లోని చెక్ డ్యామ్‌లో బిడ్డను నడుంకు కట్టుకొని దూకి ఆత్మహత్య ఆదిలక్ష్మి చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కౌన్సిలర్ జిమ్ దాము తదితరులు

కుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం 19వ వార్డుకు చెందిన అంగన్ వాడీ సహాయకురాలు అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక కౌన్సిలర్ జిమ్ దాము , 21వ వార్డు కౌన్సిలర్ ఎమ్మార్ సురేశ్ ఈ విషయాన్ని ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఐసీడీఎస్ తరఫున రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని మృతురాలు వనిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రాధా, రేఖ, విజయ్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యం



సంతలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో ప్రసాద్ తదితరులు

సోమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించడంతో భవిష్యతులో మానవ మనుగడకు అవసరమైన ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించడం జరుగుతుందని ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సోమల పట్టణవీధుల్లో, వారపు సంతలో నిల్వ ఉన్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్ వస్తువులు కనిపించకుండా తొలగించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచినప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు విశ్వమాలిని, జయశంకర్, మణికుమార్, ఫయాజ్, జయరాం, దివ్యభారతి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయ సాధనకు కృషి చేయాలి



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సోమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయసాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎన్నికల పరిశీలకుడు ఎం.ప్రభాకర్ కోరారు. శుక్రవారం స్థానిక ఏఎంసీ యార్డులో సోమల పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఇరికిపెంట, నంజంపేట, నడింపల్లె పంచాయతీల్లో గ్రామ కమిటీలతో సమావేశాలు నిర్వహించారు. పార్టీకోసం నిరంతరం కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, మాజీ వైస్‌ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచులు మునిచంద్ర, కొల్లా హరిప్రసాద్, డైరెక్టర్ అష్రఫ్ అలీ, నీటిసంఘ అధ్యక్షుడు గల్లా బోస్, మహేంద్ర కుమార్, రమేశ్‌నాయుడు, మోహన్‌నాయుడు, భానుప్రకాశ్‌నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, అక్కినేని, అమానుల్లా, జనార్ధన్, సుబ్బయ్యశెట్టి, రెడ్డి పార్థసారథి, మణి యాదవ్, చాణుక్య, మునిచంద్ర, శ్యాంసుందర్ బాబు, శ్రీనివాసులు, శివ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇరికిపెంటలో చెరువుల వేలం

సోమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట పంచాయతీలోని పలు చెరువులకు శుక్రవారం వేలం నిర్వహించినట్లు ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో కార్యదర్శి మేనక వేలం నిర్వహించారు. చెన్నపట్నం చెరువులో చేపల పెంపకానికి రూ.1.25 లక్షలకు కరణం శ్రీనివాసులు నాయుడు దక్కించుకున్నారు. మేటిమంద సమీపంలోని సోమప్పచెరువును రూ.37,500 లకు , కదిరిదేవుని చెరువును రూ 7,500 లకు వై మోహన్‌నాయుడు, సాకిరేవుకుంటను మణి రూ.9,500 లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, చంద్రశేఖర్‌నాయుడు, భానుప్రకాశ్ నాయుడు, కోటీశ్వరరావు, వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రదానం



పట్టా అందుకుంటున్న పల్లవి

సోమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గట్టువారిపల్లె గ్రామానికి చెందిన పల్లవి బెంగళూరు జైన్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను స్వీకరించింది. సామాన్య రైతు కుటుంబానికి చెందిన మాసన్నగారి అక్కులప్ప, సంపూర్ణమ్మల కుమార్తె పల్లవి ప్రభుత్వ విద్యాసంస్థలో చదువుకొని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ గోల్డ్ మెడల్ సాధించింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభా అవార్డు స్వీకరించింది. తాజాగా జైన్ యూనివర్సిటీ నుంచి భారత క్రికెటర్ టికె. వెంకట వరప్రసాద్, కల్యాణ్ జ్యువలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీ కే సీతారామన్ నుంచి పీహెచ్‌డీ పట్టాను స్వీకరించడంతో గట్టువారిపల్లె గ్రామస్తులు పల్లవిని ఆమె భర్త శివకుమార్ (సోమల మండలం సూరయ్యగారిపల్లె)ను అభినందించారు.

శెట్టిపేటలో పీహెచ్‌సీ పునఃప్రారంభానికి హామీ

చౌడేపల్లె, నవంబరు21(ఆంధ్రజ్యోతి): శెట్టిపేటలో శిథిలావస్థలో ఉన్న పీహెచ్‌సీని పునః ప్రారంభం చేస్తామని అబ్కార్, పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కందూరి నాగేశ్వర్ నాయుడు శెట్టిపేట మహిళలకు శుక్రవారం హామి ఇచ్చారు. టీడీపీ కంచు కోటైన శెట్టిపేట పంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న పీహెచ్‌సీ ని తీసేశారని ఆయన దృష్టికి శెట్టిపేట టీడీపీ మహిళలు, టీడీపీ నాయకులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాన్, మంత్రి నారాలోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, సీఎం దృష్టికి తీసుకెళి నూతన భవనాన్ని నిర్మించి పీహెచ్‌సీని పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, సింగిల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్, నారాయణరాజు, శెట్టిపేట గ్రామం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎ.కొత్తకోట విద్యార్థి



చౌడేపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఏ కొత్తకోట హైస్కూల్ విద్యార్థిని వెన్నెల ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగమల్లిక పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తిరుపతిలో జరిగిన పోటీలల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వెన్నెల ఎంపికైందన్నారు. డిసెంబరు 6నుంచి 8 వరకు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.

దాతల సహకారంతో అన్నదానం



పుంగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కల్యాణవెంకటరమణ స్వామి ఆలయలంలో దాతల సహకారంతో ప్రతి శనివారం అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆలయ ఆవరణలో దాతలు సంతోష్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో ప్రతి వారం అన్నదానం చేయడంతో ఎంతోమంది పేదవారు ఆకలి తీర్చుతున్నట్లు ఆయన తెలిపారు.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న గ్రీన్ అంబాసిడర్లు

సోమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు సోమల డంపింగ్ యార్డులో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలోనే పలు రకాల మొక్కలను అధికారులు నాటారు. గ్రీన్ అంబాసిడర్లుకు పలు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందుకొన్న విద్యార్థులు

పలమనేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక నార్తు పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, రంగేలి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా గెలిచిన నిష్విన్, విజయచంద్ర, హాసిని, నిషిత, జయదేవ్, తనుశ్రీ, ధనుష్‌కుమార్, మోక్షిత, పూజ, జాహ్నవి, డింపుల్, భావన తదితర విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయ అధికారి హేమకుమార్, నార్తు స్కూల్ ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్ర సర్టిఫికేట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో విజయ, చంద్రకళ, కలైమతి, అంబిక, గంగాబాయ్, ప్రవళిక, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకోవాలి



వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తున్న ఎన్నికల పరిశీలకుడు

పుంగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరు మున్సిపాలిటీని సమష్టి కృషితో తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవాలని ఎన్నికల పరిశీలకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పుంగనూరు పట్టణంలోని పలు వార్డుల్లో జరిగిన టీడీపీ కమిటీ ఎన్నిక సందర్భంగా పార్టీ పరిశీలకులు కె. అమరనాథ్‌రెడ్డి, వై. అశోక్‌యాదవ్, మహేశ్‌యాదవ్‌లు వార్డుల్లో దిశ నిర్దేశం చేశారు. పుంగనూరు కమిటీలను సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినట్లు చెప్పారు. గ్రూపు రాజకీయాలతో టీడీపీ బలహీన పరచాలని ప్రయత్నంచే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. పార్టీకి చెడ్డపేరు వచ్చేలా ప్రయత్నంచే నేతల గురించి హైకమాండ్‌కు నివేదిక పంపి సస్పెండ్ చేయిస్తామని హెచ్చరించారు. పుంగనూరు, రూరల్ పరిధిలో సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐలు వెంకటరమణ, హరిప్రసాద్ పోలీసు బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పచ్చదనమే లక్ష్యం



మొక్క నాటుతున్న డీఎల్‌డీవో రామచంద్ర

చౌడేపల్లెనవంబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శుభ్రత, పచ్చదనమే థీమ్ కార్యక్రమం లక్ష్యం అని ఎండీఎల్‌డీవో రామచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దిగువపల్లెలో పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్‌లకు థీమ్ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రకృతి మనకు సూర్యకాంతి, నీరు, మట్టి, ఖనిజాలు తదితరలను అందించిందన్నారు. అన్ని ఇస్తున్న ప్రకృతిని పరిశుభ్రంగా ఉంచటం మన బాధ్యత అన్నారు. గ్రామాలలో పారిశుధ్యం, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రజలను భాగస్వాములగా చేసి సమిష్టి కృషితో గ్రామాలలో శుభ్రత, పచ్చదనంగా ఉండేలా చర్యలు తీసుకుంటే అందరు ఆరోగ్యంగా ఉంటామని అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో లీలామాధవి, ఈవోఆర్డీ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా టీడీపీ సంస్థాగత ఎన్నికలు



కాంతారాజును సన్మానిస్తున్న నాయకులు

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, పులిచెర్ల టీడీపీ ఎన్నికల పరిశీలకులు రామకృష్ణాచారి తెలిపారు. పులిచెర్ల మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఎన్నికల పరిశీలకులు ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో టీడీపీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని 102 రామిరెడ్డిగారిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాధాకృష్ణయ్య, రాజులపల్లి- నారాయణ, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి - బాషా, అయ్యావాండ్లపల్లి - కాంతారావు, దిగువపోకలవారిపల్లి - వెంకటశిద్ధులు, మతుకువారి పల్లి - సురేష్, బోడిరెడ్డిగారిపల్లి - మునేంద్ర, చల్లావారిపల్లి - ఉదయ్‌కుమార్, పాతపేట - శ్రీనివాసులు, దేవళంపేట - వెంకటమునినాయుడు, రెడ్డివారిపల్లి - మాధవరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రతాప్‌రాజు తెలిపారు. టీడీపీ నాయకులు ముల్లంగి వెంకటరమణ, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, కుమార్‌రెడ్డి, మురళీధర్‌నాయుడు, మహేష్, రమేష్ తదితరులు

భువనేశ్వరికి ఘనస్వాగతం

విద్యార్థులతో ముచ్చటించిన భువనేశ్వరి





ఆనిగానూరులో వాసవీ కన్యకా పరమేశ్వరిని దర్శించుకున్న భువనేశ్వరి, విజలాపురం పెద్దచెరువు వద్ద భువనేశ్వరికి గజమాలతో స్వాగతం

రామకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం రామకుప్పం పర్యటనకు వచ్చిన సీఎం సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి టీడీపీ శ్రేణులు సాదరస్వాగతం పలికారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు విజలాపురం పెద్దచెరువు వద్దకు చేరుకున్నారు. నారా భువనేశ్వరికి భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు. గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, అంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శి కామరాజనాయక్, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగురైతు, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు చలపతి, నరసింహులు, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జీలు రవిరెడ్డి, నాగభూషణం, కో-ఇన్‌చార్జీ శంకర్‌చలం సలాంసాబ్, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, వెంకటాచలం, రెస్కో డైరెక్టర్లు మనోహర్, విజయ్ కుమార్, శ్రీనివాసులు, కుమార్ పాల్గొన్నారు.



విజలాపురం పెద్దచెరువు జలహారతిలో భువనేశ్వరి

● రామకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురం పెద్దచెరువులో జలహారతి కార్యక్రమంలో పాల్గొని ఆనిగానూరుకు బయలుదేరిని నారాభువనేశ్వరీ విజలాపురం సమీపంలో రోడ్డు పక్కన వేచి ఉన్న విద్యార్థులను గమనించి తయ వాహనాన్ని ఆపారు. విద్యార్థుల వద్దకు వెళ్లి ముచ్చటించారు. అమ్మనాన్నలు చెప్పినట్టు నడుచుకోవాలని, బాగా చదవాలని ఆమె సూచించారు. అక్కడి నుంచి ఆనిగానూరుకు చేరుకున్న భువనేశ్వరి స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహక పెద్దలు ఆర్‌కేరామ్మూర్తి, సులోచన దంపతులు ఆమెను సన్మానించి ప్రసాదాలను అందజేశారు. ఆనిగానూరులో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం అనంతరం ఆమె రామకుప్పం మండలంలో ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన 65 మంది రైతులకు రూ.4.70 లక్షల నష్టపరిహారం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్‌మర్మత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, వీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబు, టీటీడీ మెంబర్ శాంతారాం, రామకుప్పం మండల నేతలు మునస్వామి, పత్ర నారాయణాచారి, వెంకటరమణ, ఆనందరెడ్డి, అంజనేయరెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, సీతాపతి, గుర్రప్ప వెంకట్రామగౌడు, రామ్మూర్తి, గంట్లప్పగౌడు, శ్రీనివాసులురెడ్డి, రఘు, విశ్వనాథ్, జయశంకర్, శంకర్‌చలం, మహేంద్రనాయుడు, నవీన్‌రాయల్, మణేష్, కృష్ణారెడ్డి, కుమార్, మనోహర్, లోకేశ్, అవినాశ్‌రెడ్డి, మురళీ, విజయ్‌కుమార్‌రెడ్డి, సురేష్, పెరుమాళ్, శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ



క్లీన్ అండ్ గ్రీన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాజశేఖర్‌బాబు

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డంపింగ్‌యార్డను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ముత్యాలు

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని షుగర్ కేన్ డిప్యూటీ కమిషనర్ మరియు మండల ప్రత్యేకాధికారి ముత్యాలు తెలిపారు. పులిచెర్ల మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లి సచివాలయంను శుక్రవారం ప్రత్యేకాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం రికార్డులు, సిబ్బంది హాజరు ను పరిశీలించారు. ప్రజలతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ప్రత్యేకాధికారి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మునిరాజ, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని గ్రామాల్లో బలోపేతం చేయాలి



చెంచమరెడ్డిగారిపల్లెలో కమిటీ ఎన్నికల్లో పరిశీలకులు రమేష్

రొంపిచెర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గ్రామాల్లో బలోపేతం అయ్యేలా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పనిచేయాలని టీడీపీ రొంపిచెర్ల మండల పరిశీలకులు రాష్ట్ర గ్రీన్, బ్యూటీషియన్ డైరెక్టర్ రమేష్ అన్నారు. రొంపిచెర్ల మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, బోడిపాటివారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగల్లు, పెద్దమల్లెల, రొంపిచెర్ల, చెంచమరెడ్డిగారిపల్లె గ్రామాల్లో రెండో రోజు శుక్రవారం టీడీపీ కమిటీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. గానుగచింత గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శేషాద్రి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ముద్దుకృష్ణ, మోటుమల్లెలకు నాగభూషణం, గంగిరెడ్డి, బోడిపాటివారిపల్లెకు రవినాయుడు, డి.రవి, బొమ్మయ్యగారిపల్లెకు చంద్రశేఖర్ నాయుడు, ఆరేపల్లిసహదేవ, పెద్దగొట్టిగల్లుకు వై.శివకుమార్, నరేష్‌కుమార్, పెద్దమల్లెలలో బి.నాగేశ్వర్, రెడ్డెప్ప, రొంపిచెర్లలో జి.ఇమ్రాన్‌ఖాన్, రాధాక్రిష్ణ, చెంచమరెడ్డిగారిపల్లెలో సి.సురేంద్ర, ఈశ్వరయ్యలు ఎన్నికైనట్లు పరిశీలకులు అమరనాథ్ తెలిపారు. రాష్ట్రకురబ కార్పోరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, నాయకులు రవికుమార్‌నాయుడు, ఓబులేశ్వరరెడ్డి, రఘునాధ, చెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు



విలేకరులతో మాట్లాడుతున్న సింగిల్ విండో డైరెక్టర్ కోలాట వెంకటరమణ

పుంగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేతిగుట్లపల్లె సమీపంలో నిర్మించిన ప్రాజెక్టు వద్ద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా వైసీపీ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని సింగిల్‌విండో డైరెక్టర్ కోలాట వెంకటరమణ ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ కాలంలో రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రాజెక్టు నిర్మించి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తున్నట్లు పత్రికల్లో రాయించుకోవడం సరికాదన్నారు. ప్రాజెక్టు నిర్మించడం కారణంగా ఏటిగడ్డకంపల్లె పూర్తిగా నీట మునుగుతుందన్నారు. రైతులు వ్యవసాయ భూములను నమ్ముకుని జీవిస్తున్నారని, వారిని మోసం చేసిన వైసీపీ నాయకులు మాట్లాడటం చూస్తే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో పులి వెంటకరమణ, గంగులప్ప, వెంకటరమణ, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఎన్జీవో నూతన అధ్యక్షుడిగా రహమత్‌అలీఖాన్



రహమత్‌అలీఖాన్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ఎన్జీవో నూతన అధ్యక్షుడిగా రహమత్‌అలీఖాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు అనందబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడు రహమత్‌అలీఖాన్, అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా మురళీబాబు, వనశ్రీ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, కార్యదర్శిగా శివకుమార్, సహాయ కార్యదర్శులుగా టి. సుబ్రహ్మణ్యం, సహదేవుడు, ముబారక్ బాషా, జాయింట్ కార్యదర్శిగా జ్యోతమ్మ, కోశాధికారిగా రఘురామయ్యలను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు లక్ష్మీపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్ష ఫీజుకు నగదు సాయం



పరీక్షల ఫీజుల చెల్లింపునకు నగదు అందజేస్తున్న దాతలు

పుంగనూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల పరీక్షల ఫీజులను ముగ్గురు దాతలు చెల్లించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డెమ్మ, వెంకటరమణ, హేమలత తెలిపారు. శుక్రవారం హార్ట్‌టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పూజగానిపల్లె ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 36మంది విద్యార్థులకు దాత చోక్లనాయక్ రూ. 4500, ఈడిగపల్లె ప్రభుత్వ పాఠశాలలో 45 మంది విద్యార్థులకు దాత భూక్యాభానుప్రసాద్ రూ.5,625, చంద్రమాకులపల్లె ప్రభుత్వ పాఠశాలలో 21 మందికి భూక్యా జగదిష్‌నాయక్ రూ.2625 పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ దాత సహకారంతో పిల్లలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అశోక్‌కుమార్, మురళీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధురాలికి అమ్మఒడి అంత్యక్రియలు



చిత్తూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అమ్మఒడి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతూ శుక్రవారం మృతి చెందిన వృద్ధురాలు పాపమ్మ(85)కు ఆశ్రమ ఫౌండర్ పద్మనాభనాయుడు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వృద్ధురాలి బంధువులకు సమాచారం అందించి వారి సమక్షంతో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు మధుబాబు, పూల ధనమ్మ, బ్రహ్మచారి, ప్రకాష్, ప్రభాకర్, చండి ప్రభా, గణేష్, మనోజ్, మురళి, వాసుదేవన్, శోభ, లలిత తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్
- 7, 46 వార్డుల్లో సిమెంటు రోడ్ల ప్రారంభం



చిత్తూరు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ సిమెంటు రోడ్లు, కాలువలు, వీధి దీపాలను దశలవారీగా నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. శుక్రవారం నగరంలోని 7వ వార్డులోని బాహూజీనగర్, 46వ వార్డులోని విజయలక్ష్మీకాలనీలో రూ. 28.90 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, కాలువను మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ రమేష్‌నాయుడు, వెంకటేశ్ యాదవ్, టీడీపీ నగర అధ్యక్షులు నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చప్ప.. నగర, నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు మీకు పట్టవా..?

- అధికారులను ప్రశ్నించిన థామస్



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే థామస్

పెనుమూరు, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : మండల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మీకు పట్టవా అంటూ అధికారులను ఎమ్మెల్యే థామస్ ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆయన హాజరయ్యారు. ప్రజలు నుంచి 117 అర్జీలు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపి సకాలంలో పరిష్కరించాలని కోరారు. 10 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.7.40 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసు కెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఏకాంబరం, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏఈ తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషిచేస్తా

- ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం పూతలపట్టు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఐరాల మండలం గుండ్లపల్లి పంచాయతీ సమీపాన గల ఎస్టీకాలనీవాసులు తమకు పక్కాగృహాలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఆయన తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండుమూడు రోజుల్లో ఎస్టీ కాలనీని సందర్శిస్తానని వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో నాగరాజు, పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాల టీడీపీ అధ్యక్షులు దొరబాబు చౌదరి, గంగారపు హరి, వెంకటేష్ చౌదరి, ధరణిప్రసాద్, నాయకులు గిరిధర్‌బాబు, గంగారపు గోపి, ప్రతాపనేని చంద్రమౌళి, చిరంజీవి, జగన్నాథం, మురళి, హౌసింగ్ డీఈ యాగమూర్తి నాయుడు, ఏపీవో సంధ్యారాణి, ఏవో మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల జీవనోపాధులు పెరగాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాధులు పెరగాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, సిబ్బందిలో స్వయం సహాయ సంఘాల మహిళల జీవనోపాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు సభ్యులకు వర్తింపజేసి వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డానికి కృషి చేయాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లించేలా చూడటంతో పాటు మండల స్థాయిలో ఈజీ మార్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీపీఎం రవి, వరలక్ష్మి, ఏపీఎంలు మధుసూదన్, సుబ్బారెడ్డి, హేమ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలి

నగరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.680 ప్రకారం రూ.10వేలు వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రన్ అధ్యక్షతన కార్మికులతో కలిసి ఎంపీడీవో వాణికి వినతిపత్రం అందించారు. ఎంపీడీవో స్పందిస్తూ జిల్లా అధికారులతో చర్చించి పెండింగ్ వేతనాలు ఇచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. గ్రీన్ అంబాసిర్ల మండల నాయకులు దేశప్ప, మురళి, కుమార్, నాగభూషణం, జ్ఞానమణి, కుమారి, దండమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని తిమ్మసముద్రానికి చెందిన ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు.. నగరంలోని తిమ్మసముద్రానికి చెందిన గౌరీశంకర్(18) అమరరాజ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మరణానికి కారణాలు తెలియలేదు. అతడి ఫేస్‌బుక్, ఇన్‌స్టా అకౌంట్లను డెలిట్ చేసినట్లు అతడి స్నేహితులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు కాలేదు.

జిల్లా పెన్షనర్ల కార్యవర్గ సమావేశం

చిత్తూరు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం పెన్షనర్ల భవన్‌లో జరిగింది. ఆ సంఘ జిల్లా అధ్యక్షులు నాగరాజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత గత సమావేశం తరువాత పరమపదించిన 15 మంది పెన్షనర్లకు జిల్లా కార్యవర్గం నివాళులు అర్పించింది. అనంతరం క్వాంటమ్ ఆఫ్ పెన్షన్లు, డీఏ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు, హెల్త్‌కార్డులు, మెడికల్ రీఎంబర్స్‌మెంట్, పెన్షనర్ల సభ్యత్వ నమోదు తదితర విషయాలపై చర్చించారు. అదేవిధంగా సంఘంలో ఖాళీగా ఉన్న రెండు ఈసీ మెంబర్ పోస్టులకు వాసుదేవనాయుడు, ఎన్‌వీ రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కుప్పం, పలమనేరు, బంగారుపాళ్యం పాలసముద్రం మండలాల నుంచి తాలూకాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘ జిల్లా కోశాధికారి ప్రభాకర్‌నాయుడు, నేతలు ఏకాంబరనాయుడు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి పూజలు

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరంలోని ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లోని గ్రంథాలను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలని వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద తెలిపారు. శుక్రవారం ఆ కళాశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబుకు సన్మానం



నింద్ర, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా నియమితులైన చినబాబును నింద్ర మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు తేజేష్, రైతు విభాగ నాయకుడు గాలి రమేష్ నాయుడు, తెలుగుయువత ఓం ప్రకాష్ తదితరులు ఉన్నారు.

బుగ్గ ఇళ్లత్తూరు రోడ్డుకు మోక్షం



విజయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంతలమయంగా ఉన్న బుగ్గ ఇళ్లత్తూరు రోడ్డుకు నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ కృషితో మోక్షం లభించింది. నగరి నుంచి బుగ్గ గుడి మీదుగా ఇళ్లత్తూరు, విజయపురం, తమిళనాడు నల్లాట్టూరు వెళ్లే రోడ్డు దుస్థితికి చేరుకొని వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

క్రమశిక్షణ గల విద్య అవసరం

వెదురుకుప్పం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని కార్వేటినగరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజారమణి అన్నారు. శుక్రవారం కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవ వారోత్సవం నిర్వహించారు. బాలల హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బాలల హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం కె.సుప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీ టి.జ్యోతి, ఎంపీహెచ్ఏ ఎం.సుగుణ, బి.మాధవి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

25న వెదురుకుప్పం మండల మీట్

వెదురుకుప్పం: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీన ఎంపీడీవో సమావేశపు మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

డిజిటల్ నర్స్ సెంటర్ పేదల సంజీవిని

- డీఎంహెచ్‌వో సుధారాణి



ఎంఎల్‌హెచ్‌పీలకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డిజిటల్ నర్స్ సెంటర్ పేదలకు సంజీవిని లాంటిదని డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీలకు డిజిటల్ నర్స్ సెంటర్‌లో విధివిధాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుప్పంలో ఏర్పాటు చేసిన నర్స్ సెంటర్ మాదిరిగా చిత్తూరులో ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ కేంద్రం ద్వారా చిత్తూరు నలుమూలల నుంచి అత్యవసర సేవలకు, ఇతర వ్యాధులకు ఏ మందులు వాడాలి, ఎక్కడ చికిత్స అందిస్తారనే విలువైన సమాచారాన్ని ఫోన్ ద్వారా ఉచితంగా పొందవచ్చునన్నారు. 24 గంటలు ఈ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో ప్రవీణ, టాటా కంపెనీ ప్రతినిధి తపన్‌దాస్ పాల్గొన్నారు.

● పల్స్ పోలియో కార్యక్రమానికి సన్నద్ధం కావాలి

డిసెంబరు 21న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి వైద్యాధికారులు సన్నద్ధం కావాలని డీఎంహెచ్‌వో సుధారాణి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

దివ్యాంగులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఐరాల(కాణిపాకం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం అగరంపల్లెలోని జడ్పీ హైస్కూల్లోని క్రీడామైదానంలో నియోజకవర్గంలోని దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పరికరాలను వినియోగించుకుని దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, ఆలయ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, మాజీ జడ్పీటీసీ లత, పీడీలు విక్రమ్‌కుమార్‌రెడ్డి, శ్రీదేవి, ఆర్డీవో శ్రీనివాసులు, ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి: ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్ర వారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన వినతులలో అప్పుడే పరిష్కరించదగిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన వాటిని సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 74 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, తహసీల్దార్ జయప్రకాష్, ఎంపీడీవో శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నగరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరిలో ప్రధాన మంత్రి యోజన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. నగరి మున్సిపల్ పరిధిలో సుమారు 445 మంది లబ్ధిదారులకు ఈ పత్రాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడి ఖాతాలో 2,50,000 జమవుతుందని తెలి పారు. అనంతరం మెప్మా తరఫున 1996 మంది వీధి వ్యాపారస్తులకు రూ.3,56,46 000లు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో వాణి, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు, ఏకాంబరకుప్పం ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ప్రసాద్, సీవో తిరుమలయ్య, స్వరూప, హిమబిందు, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసం, జ్యోతినాయుడు, అశోక్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే థామస్ చొరవ.. సిమెంటు రోడ్డుకు మోక్షం

వెదురుకుప్పం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే థామస్ చొరవతో సిమెంటు రోడ్డు ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను అధికారులు తొలగించారు. కార్వేటినగరం మండలం సీడీకండ్రిగ వడ్డిఇండ్లు గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం లేదు. మూడేళ్లుగా ఈ సమస్య ఉంది. నాలుగు రోజుల క్రితం కార్వేటినగరం పర్యటనకు వచ్చిన థామస్ దృష్టికి ఆ గ్రామస్తులు సమస్యను తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సర్వే చేసి ఇవ్వాలని తహసీల్దార్ నాగరాజును ఎమ్మెల్యే ఆదేశించారు. శుక్రవారం ఆ గ్రామానికి చేరుకున్న తహసీల్దార్, ఆర్ఐ నరసింహులు ఇతర బృందం సర్వే చేసి గ్రామస్తులతో చర్చించి సిమెంటు రోడ్డుకు అవసరమయ్యే స్థలాన్ని చూపించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

నింద్ర, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అని డీడీవో ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కొప్పేడు పంచాయతీలో పర్యావరణం పచ్చదనం పరిశుభ్రతపై కొప్పేడులోని బృందావనం వద్ద సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ కార్యదర్శులకు, సంఘమిత్రలకు ఒక రోజు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సంపూర్ణమ్మ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశులు, ఎమ్మార్సీ అరుణాచలం, పాల్గొన్నారు.

విజయపురం: పచ్చదనం పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించడంలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తారని ఎంపీడీవో రాజేంద్ర పేర్కొన్నారు. కోసలనగరంలో పారిశుధ్య కార్మికులకు ఒక రోజు శిక్షణా సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టామని ఎంపీడీవో పురుషోత్తం తెలిపారు. మండలంలోని హరిత రాయబారులను పిలిపించుకుని ఆ గ్రామంలో పారిశుధ్య పనులు చేశామని తెలిపారు.

గుడిపాల: గ్రామీణ ప్రాంతాలలో పూర్తి స్థాయిలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని ఎంపీడీవో శిరీష అన్నారు. బసవాపల్లె పంచాయతీలో ఎల్ఎస్‌జీజీఎస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్స్‌కు ఆమె పలు సూచనలు చేశారు. ఈవోఆర్డీ కృష్ణప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

గంగాధరనెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిగ్రామంలో పరిసరాలు పరిశుభ్రంతో పాటు పచ్చదనం పెంపొందాలని డీపీవో సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు మండలం ముక్కళత్తూరు పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని, తాగునీటి ట్యాంక్, గ్రీన్‌అంబాసిడర్ల చెత్తతొలగింపు కార్యక్రమాన్ని డీపీవో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సీఆర్‌పీలు, గ్రీన్‌అంబాసిడర్లకు జీరో వేస్టేజ్, ట్యాంక్ క్లీనింగ్, శానిటేషన్, క్లోరినేషన్, ఫాగింగ్ విషయాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామ సచివాలయాల డీడీవో రవికుమార్, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో శివయ్య, డీపీఆర్‌సీ డీఆర్‌పీ గజేంద్ర, మండల స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ మనోహర్‌బాబు, ముక్కళత్తూరు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సింగిల్ విండో సేవలను రైతులు వినియోగించుకోవాలి

గంగాధరనెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగిల్ విండో సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో ఛైర్మన్ ముప్పిరి మోహన్‌నాయుడు కోరారు. గంగాధరనెల్లూరు సొసైటీ ఆవరణంలో శుక్రవారం రైతులకు సింగిల్ విండోలో అందే వివిధ రకాల సేవలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మేనేజర్ గోమతి, సింగిల్‌విండో సీఈవో విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతాంగానికి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, తక్కువ వడ్డీకే బంగారంపై రుణాలను అందిస్తున్నామన్నారు. బ్యాంక్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



నగరి ఆలయంలో పూజలు చేస్తున్న పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామి

నగరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ధర్మ పరిరక్షణలో భాగంగా గో సంరక్షణ, రైతుల సంక్షేమం, జానపద కళల అభివృద్ధి, ప్రకృతి వ్యవసాయం కోసం ఆధ్యాత్మిక యాత్ర చేస్తున్నట్లు ఉడిపి అడమూరు శ్రీకృష్ణ మఠం పీఠాధిపతి ఈషాప్రియ తీర్థ స్వామి తెలిపారు. తమిళనాడు షోలింగర్ లోని నరసింహస్వామి ఆలయం నుంచి ఇందికీలాద్రి కనకదుర్గ ఆలయం వరకు చేపట్టిన ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం నగరి కన్యకాపరమేశ్వరి ఆలయం, కామాక్షి సమేత కరకంటేశ్వర ఆలయాలకు విచ్చేసి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బోధనల అనంతరం ఆలయం వద్ద నుంచి ఆధ్యాత్మిక యాత్రను కొనసాగించారు. మరికొన్ని క్షేత్రాలు సందర్శించి ఉడిపి మఠానికి చేరుకుంటారని ఆధ్యాత్మిక యాత్రనిర్వహణ బృందం వారు తెలిపారు.

నగరంలో ఓ మోస్తరు వర్షం







చిత్తూరు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం నగరంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నప్పటికీ మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో చిరుజల్లులతో ప్రారంభమై ఓ మోస్తరు వర్షం కురిసింది.వీధులన్నీ జలమయమయ్యాయి. మురుగునీటితో వర్షపు నీరు కలిసిపోవడంతో నీరు వీధుల్లో ప్రవహించింది. చెత్తాచెదారంతో వీధులన్నీ నిండిపోయాయి. చిరు వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అర్ధగిరిలో వ్యాసాశ్రమ పీఠాధిపతి



తవణంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామిని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వాద మండపంలో స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శివగిరి అప్రమేయనంద స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పాలసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ గురప్ప కోరారు. శుక్రవారం పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, మద్యపానానికి దూరంగా ఉండి చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. అనంతరం అధ్యాపకులతో కలసి యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ హేమలత, అధ్యాపకులు వినాయకం, రమ్య, సుశీల, భారతి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి క్యాలెండర్ ఆవిష్కరణ



ఐరాల(కాణిపాకం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది సైతం బాగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం కాణిపాక వరసిద్ధుడి ఆలయ అణివేటి మండపంలో 2026వ సంవత్సర స్వామి క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు హరిబాబునాయుడు, నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు, మాజీ జడ్పీటీసీ లత, నాయకులు పూర్ణచంద్ర పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నింద్ర విద్యార్థుల ఎంపిక





యశ్వంత్, వసంత్

నింద్ర, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు నింద్ర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదివే వసంత్, వాలీబాల్ పోటీలకు 9వ తరగతి విద్యార్థి యశ్వంత్ ఎంపికయ్యారు. వీరిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు జ్ఞానశేఖర్ ఇతర ఉపాధ్యాలు అభినందించారు.

ఆస్పత్రిలో జగన్ బోర్డు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుడిపాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మసముద్రం పీహెచ్‌సీలో ఎప్పుడు వచ్చిన డాక్టర్లు ఉండరా అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనంపై వైద్యాధికారులు స్పందించారు. ఆస్పత్రిలో ఉన్న జగన్ బోర్డును తొలగించారు. అలాగే డాక్టర్ అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జీడీనెల్లూరు డీటీగా నరేష్‌కుమార్

గంగాధరనెల్లూర: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నరేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కుప్పం ఆర్‌డీవో కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న మహేష్‌కుమార్ బదిలీపై చిత్తూరు ఆర్‌డీవో కార్యాలయానికి వెళ్లారు.

సత్యసాయికి ఎమ్మెల్యే పూజలు

చిత్తూరు సిటీ: గిరింపేటలోని సత్యసాయి సేవా సదన్ ను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం సందర్శించారు. సత్యసాయి శతజయంతి సందర్భంగా శుక్రవారం బాల వికాస్ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, రథయాత్ర నిర్వహించారు. భక్తులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.